# ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి నాసా పురస్కారం



**నూజివీడు, న్యూస్‌టుడే:** నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్న రాయల బేబీ సాయిశ్రీ అరుదైన ఘనత సాధించింది. అమెరికాలోని నాసా (నేషనల్ ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) ఏటా వివిధ అంశాల్లో రాత పోటీలు నిర్వహిస్తుంటుంది. ఈ ఏడాది 'ఆర్బిటల్ స్పేస్ సెటిల్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన పోటీలకు సాయిశ్రీ 'పద్మవ్యూహ' పేరుతో తన పరిశోధన రచనను పంపింది. అంతరిక్షంలో భూవాతావరణం సృష్టించుకొని ఎలా నివసించవచ్చో వివరిస్తూ ఆమె రాసిన ఈ వ్యాసానికి మూడో స్థానం లభించింది. దీనిపై ప్రజెంటేషన్ ఇవ్వడానికి వచ్చే నెల 28నుంచి అయిదురోజులపాటు చికాగోలో జరిగే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్సుకు రావాలని నాసా ఆహ్వానం పంపింది. ఖమ్మం జిల్లా కొణిజర్ల గ్రామానికి చెందిన సాయిశ్రీది వ్యవసాయ కుటుంబం. తండ్రి మల్లయ్య మూడెకరాల సామాన్య రైతు. సీబీఎస్ఈ సిలబస్‌తో పదో తరగతి చదివిన సాయిశ్రీ 500 మార్కులకుగాను 453 మార్కులు సాధించి గ్రామీణ కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు సాధించింది. ఇక్కడ కూడా తన ప్రతిభ కనబరుస్తోంది. అంతరిక్ష శాస్త్రవేత్త కావాలన్నదే లక్ష్యంగా ఉన్న ఆమె ప్రస్తుతం అమెరికా వెళ్లే ఆర్థిక స్థోమత లేక దాతల తోడ్పాటుకు ఎదురుచూస్తోంది.